నిమజ్జనం

"ఆటో... ఆటో."

ఆటో వచ్చి ఆగింది.

"చిక్కడ్‌పల్లి"

"పాంచ్ రూపాయ్ జ్యాదా దేనా."

"మీటర్..."

"దానిమీదే"

"పదకొండు కాందే."

"బహెన్ సహీఁ?" తల బిరుసుతనాన్ని చూపుల ద్వారా విసురుతూ.

"నహీఁ" అంటూ జేబులో నుంచి చిన్న నోట్‌బుక్ తీసి ఆటో నంబరు రాసుకున్నాడా వ్యక్తి అసహనంగా.

"నెంబర్ ఎందుకు రాసుకుంటున్నవ్?"

"పోలీసులకు ఫోన్ చేయడానికి."

"అచ్ఛా" ఓ మాదిరి తల ఊపి, ఆవిరిలా వచ్చిన కోపాన్ని అణచుకొని, మెల్లగా నవ్వుతూ - "ఇగ కూర్చోండి. అంత కోపమైతే ఎట్లానండి ?"

ఏదో గొణుక్కుంటూ పెద్దమనిషి కూర్చున్నాడు.

ఎందుకో రుసరుసలాడుతూ ఆటోస్టార్ట్ చేశాడు యువకుడు.

ఆటో టాంక్‌బండ్ మీదకొచ్చింది. స్లోగా నడుపుతూ డ్రైవర్ వెనక్కు తిరిగి, ఆటోలోని వ్యక్తిని చూశాడు. ఎనభై ఏండ్లు, ఖద్దరు చొక్కా, ప్యాంట్. పాతకాలపు రిస్ట్ వాచ్, బాగా అరిగిన బంగారు రాళ్ళ ఉంగరం. డ్రైవర్ తన ఆలోచనలకు పదను పెడుతూ ఆటోను ఆపాడు. జేబులో నుండి సిగరెట్ తీసి ముట్టిచ్చాడు.

"చూడు, సిగరెట్ పొగ నాకు పడదు. తల తిరుగుతుంది" అంటూ గాలి ఫోర్స్‌కు తన వైపు వస్తున్న పొగను వెనక్కు నెట్టుతున్నట్టు ఎడమ చేతిని ఊపాడు

" నీ తల తిప్పాలనే."

"పట్టుమని పాతికేళ్ళు లేవు, ఏంటి చాలా వాగుతున్నావ్?"

"పోలీసులకు ఏదో ఫోన్ చేస్తానన్నావ్?" అంటూ చుట్టూ చూశాడు.

వాహనాల రాకపోకలు అంతగా లేవు. సిగరెట్ దమ్ము పీలుస్తూ పెద్ద మనిషి ముఖంలోకి చూశాడు. ముడుతలుపడ్డ ముఖంలో కొట్టొచ్చినట్టు కనపడే కోపం, కళ్ళద్దాల్లో నుండి తీవ్రంగా చూస్తున్న కనుగుడ్లు, సిగరెట్ పీల్చినప్పుడు దాని వెలుతురులో కనిపించగా-

"చేతకాని ముసలి పీనుక్కి ఎంత ఇది" అంటూ కళ్ళద్దాలను లాక్కొని, "ఏదీ ఇగ ఫోన్ చేయ్" అంటూ నవ్వాడు. ఎటూ కనరాక కళ్ళు నలుపుకుంటూ, సత్తువను కూడతీసుకుని -

"ఒరే వెధవ! నన్నేమనుకుంటున్నావురా? ట్రాన్స్‌పోర్ట్ అథారిటీకి చెప్పి నీ లైసెన్సునే కాన్సిల్ చేయిస్తా. నాబోటివాణ్ణే ఇంత ఇది చేస్తున్నావు, మామూలు వాళ్ళను ఎంత హైరాన్ చేస్తున్నావో? నీవు ఈ వృత్తికి తగవురా" అంటూ ఆటోలో నుంచి దిగే ప్రయత్నం చేయగా -

"అచ్చా గవర్నర్ సాబ్ - నీవు అన్ని చేస్తవ్, చేయిస్తవ్." కాలర్ పట్టుకొని అలాగే ఆటోలో అణచి పట్టాడు. అప్పుడే కరెంట్ పోయి చీకటి పరుచుకుంది.

**

అది సమతా హాస్పిటల్.

సికిందరాబాదులోని సరోజినీ దేవి రోడ్ పక్కమ్మటే ఓ పెద్ద ప్రైవేట్ ఆసుపత్రి. తన కాంటెస్సా కారు ఎందుకో స్టార్ట్ కాకపోయేసరికి డా॥ జయసేన "ఆటోను పిలు" అన్నాడు డ్రైవర్‌తో.

ఆటో వచ్చి ఆగగానే అందులో నుంచి డ్రైవర్ మీటర్ వేశాడు.

"చూడు. కారును సరిచేసుకుని గంటలో అక్కడికి వచ్చేయ్. అడ్రన్ తెలుసు కదా ?" అంటు ఆటోలో కూర్చున్నాడు.

"తెలుసు. చిక్కడ్‌పల్లి."

"పోనీ"

ఆటో కదిలింది.

"మీటింగ్ స్టార్ట్ కావచ్చు" అనుకుంటు వాచ్ చూసుకున్నాడు.

"ఎం మీటింగ్ సార్ ?"

"ఓ సంస్మరణ సభ."

"అంటే?" అంటు ఓసారి వెనక్కు మళ్లి చూశాడు.

"పెద్దవాళ్ళు పోయినప్పుడు ఆయనకు సంబంధించిన వాళ్ళందరూ కలుసుకొని ఆయన గూర్చి ఆయన చేసిన పనుల గూర్చి చెప్పుకుంటారు". అని కాసేపు ఆగి మళ్ళీతానే -

"ఈమధ్య ఓపెద్దాయన పోయారు."

"మీ సుట్టమా సార్ ?"

"అంతకంటే ఎక్కువే. నాకేకాదు, చాలమందికి కూడా. గొప్ప మేధావి. ఆయనతో మాట్లాడడమే ఓ అదృష్టం. మేం కలుసుకున్నపుడు ఎన్నో విషయాల మీద మాట్లాడుకునే వాళ్ళం. ఆయనే నడుస్తున్న గ్రంథాలయం."

"ఆ" చూపు రోడ్డు మీద, మనస్సు మాటల వైపు వుంచుతూ అన్నాడు.

"ఈ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తి. ఆ రోజుల్లో ఆయన మిత్రులు పాటలు రాస్తే, వాటిని సభల్లో పాడించి, జనాన్ని కార్యోన్ముఖుల్ని చేసిన ఉద్యమకారుడు."

"నీవెంతవరకు చదువుకున్నావ్?"

"ఏడవ తరగతి వరకు."

"అయితే, నీకు ఆయన గూర్చి తెలియదు. నీవు నిన్న మొన్నటివాడివాయె."

"అవును సార్."

"రామనాథం గారని, చదువుకున్న వాళ్ళకు తెలుసు. ఆయన తన రచనల ద్వారా అందర్నీ ఆలోచింపచేసేవారు. మొన్నటి వరకు ఏదో ఒకటి రాస్తూనే ఉండేవారు. నేను ఆయన ఫ్యామిలీ డాక్టర్‌ను. ఎప్పటి నుండో వయస్సు పైబడుతూ ఉన్న కొద్దీ వచ్చే రోగాలు, నొప్పుల నుండి ఆయనను కాపాడుతూ వచ్చాను. ఇంకా కొన్నాళ్ళు బ్రతికేవాడే, బ్రతికితే బాగుండేది."

"మరెట్లా సచ్చిండో?"

"అదే తెలియటం లేదు."

ఆటో టాంక్‌బండ్ మీద నడుస్తోంది.

"ఈబొమ్మలున్నాయ్ చూడు, ఆ రాజుల బొమ్మలు ఎందుకు పెట్టారో నాకు తెలియదు. వాటిని వొదిలేస్తే మిగిలిన వాళ్ళల్లో కొందరి భావాల వారసుడు ఆయన. వీళ్ళ ఆలోచనలను ఈ తరం వాళ్ళకు పంచిన గొప్ప మేధావి."

ఆటోను స్లో చేసుకుని, కూల్ డ్రింక్ బంకు ముందు

ఆపి-

"మీరు ఏమైనా... ?"

"నే, నీవు తాగిరా" అంటూ తన చూపులను శ్రీశ్రీ మీదనుండి మఖ్దూమ్ మొహియొద్దీన్ వైపు మరలించి, ఆ తరువాత చెరువులోని నీళ్ళవైపు చూస్తూ కూర్చున్నాడు. తల నిండా గతం తాలూకు ఆలోచనలు, కళ్ళ నిండా రామనాథం గారి రూపం.

ఓ సోడా తాగి, ముఖానికి పట్టిన చెమటను తుడుచుకొని ఆటో స్టార్ట్ చేసుకొని కదిలాడు.

"డాక్టర్‌గారూ, మీరు చెప్పిన ఆ పెద్దమనిషి ఎట్లా సచ్చింది నేను చెప్పనా....?"

ఏదీ చెప్పు అన్నట్టు చూశాడు.

"మీరన్న ఈ బొమ్మలు చూస్తుండగనే ఇదే చెరువులో దుంకి సచ్చిండంట."

"అవునా?"

"అవును, పల్లు బాగా లేక డాక్టర్‌కు సూపించుకొని వొస్తూ వొస్తూ, కడుపులో నొప్పి ఎక్కువై తట్టుకోలేక"

"నేననుకోను"

"తమరనుకోకపోయినా"

"ఆయనకు కడుపు నొప్పేమిలేదే!"

"ఉందని అందరూ అంటున్నారు"

"అలాగా!"

"ఆ పీనుగను తీసి ఈకట్టమీదనే గదా పోలీసోల్లు పంచనామ చేసింది ?"

"పత్రికల్లో చూశా. నాదగ్గరికే వచ్చి చూపించుకున్నాడు. మంచిగనే ఉండె. ఆ రోజు ఆయనకు ఏమనిపించిందో జేబులోనుండి కొన్ని నోట్లు తీసి "ఇన్నాళ్ళ నుండి మీరు నాకు వైద్యం చేస్తున్నారు. ఎప్పుడూ ఏం తీసుకోలేదు వీటిని ఉంచండి" అన్నారు. నేను వద్దని మళ్ళీ ఆయన జేబులోనే పెట్టి, "మీరు సమాజానికి చేస్తున్న సేవల్లో నేను మీకు చేసేది ఏమాత్రం?" అని పంపించాను."

"ఆయన జేబులో ఏమీ లేవట."

"అదెట్లా? డబ్బే కాదు," అనేలోపే-

"బతికున్నప్పుడే దోచుకుంటున్న ఈ రోజుల్లో సచ్చినాక ఎవరుంచుతారు సార్! ఆరోజు అంటూ ఉండిరి. పోలీసోల్లే కొట్టేయ్యొచ్చని"

డాక్టర్ మౌనంగా విని "అంత గొప్పవాడు ఇలా ఎందుకు చస్తాడా అని..."

ఆటో అంబేడ్కర్ విగ్రహం ముందు నుండి

వెళుతోంది. ఎందుకో ఒళ్ళంతా జలదరించినట్లయి స్పీడ్‌ను పెంచాడు.

"తమరు గొప్ప గొప్ప అంటున్నారు - నాలుగు రోజులైనా పీనుగను గుర్తు పట్టే దిక్కే లేదట."

"అదే ఆయన అలా చస్తాడని ఎవరూ అనుకోరు గదా!" కొంతసేపు ఇద్దరి మధ్య మౌనం చోటు చేసుకుంది.

"గవర్నర్, ముఖ్యమంత్రి ఆయన గురించి మాట్లాడినట్టు పేపర్లో వచ్చింది. ఆయనే గదా మీరనేది ?"

"ఆఁ ప్రధానమంత్రి కూడా ఫోనులో తన విచారాన్ని వెలిబుచ్చాడ ".

కొంతసేపు ఇద్దరి మద్య నిశబ్దం ఆటో వేగంగా వెళుతూ వుంది.

"ఆపు" అంటూ ఆగిన ఆటో దిగి, మీటర్ చూసి పైసలిచ్చి సభవైపు నడిచాడు. అప్పటికే రావలసిన వాళ్ళందరూ వచ్చి కూర్చున్నారు.

ఆటో డ్రైవర్ సిగరెట్ అంటించుకొని సభా వేదిక మీద ఉన్న ఫోటోను చూశాడు. అదే ఫోటో! ఆ మధ్య పేపర్లొచ్చిందే! వేళ్ళ మధ్య వెలుగుతున్న

అగ్గిపుల్లను ఆర్పి నేలమీద విసిరాడు.

అంతవరకు ఓ పక్క తన రిక్షాను ఆపుకొని, అందులోనే కూర్చొని ఉన్న రిక్షా అతను దిగి, ఆగిన ఆటో దగ్గరికి వచ్చి-

"జర మాచ్చాసు ఇయ్యి బాయి సాబ్" అంటూ అడిగాడు.

ఆటోవాడు అగ్గపెట్టెను అందిచ్చాడు. బీడీని వెలిగించుకొని దమ్ము పీల్చి అగ్గిపెట్టెను తిరిగి ఇస్తూ -

"సావునాడు ఎవరూ లేరు. దినం నాడు ఎంత మందొచ్చింద్రో సూడు." అంటు పీల్చిన పొగను ముక్కు గుండ వొదిలాడు:

ఏవో ఆలోచనల్లో మౌనంగా ఉన్నాడే తప్ప, మాట్లాడలేదు ఆటోవాడు.

"సావునాడు నేనే, నా రిక్షాలోనే పీనుగను ఓ గుడ్డలో చుట్టుకొని కాష్ఠాల గడ్డకు తీసుకుపోయినా. కొడుకు - కోడలు , ఇంకా నలుగురైదుగురు - ఏం కావాల్నో తెలియదు."

"అట్లనా!"

"మాబస్తీల ఎవరన్న సస్తే, బస్తీ బస్తీకి సెప్పంపి,

ఆయల్ల అందరం పని బందు సేసి సావు సేస్తం. ఎవ్వర్కి సెప్పనట్టుంది. ఈ యల్ల ఇంత మంది వొచ్చినోళ్ళు ఆయల్ల కొందరైనా రాలే."

"కాష్టం కాల్చి బూడిదైతే చేసింఙ్రు గదా."

"సెయ్యకుంటే అప్పటికే ఆ సెర్ల చేపలు, కప్పలు ఏమేమ్ పీక్కతిన్నయో" అని కాలి ఆరిపోయిన బీడీ ముక్కను పారేస్తూ అన్నాడు.

"అసలీ ముసలోడు అండ్ల ఎట్ల పడ్డడట ?" అంటూ జేబులో నుండి గుట్క ప్యాకెట్‌ను చించి, కొంత పొడిని నోట్లో వేసుకున్నాడు.

"ఎవరు సరిగ సెపుతుంఙ్రని? నలుగురు నాలుగు రకాలుగ అనుకుంటుంఙ్రు. ఈయాల్దాక ఓ పెద్దాయన అంటుండె."

"ఏమని?" నోట్లో గుట్క పొడిని నములుతు.

"ఆయనంతటాయన సెర్ల దూకి సచ్చేటోడైతే కాదు అని"

"మరి నువ్వేమంటావు సెప్పు"- రిక్షావానికో సిగరెట్ ఇచ్చి, దానిని తానే అంటిస్తూ అడిగాడు.

"ఆ ఉన్నయన్ని గుంజుకొని ఎవడో చెర్లోకి నూకేసినట్టుంది." సిగరెట్ దమ్ము లాగుతూనే

ఆటోవాని ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"నువ్ సూసినవ్ బే" అంటూ కోపంగా చూస్తూ చేతిలో కాలుతున్న అగ్గిపుల్లను రిక్షావాని మీద విసిరి, ఆటోను స్టార్ట్ చేసుకుని అక్కడ నుంచి స్పీడ్‌గా వెళ్ళి రోడ్డెక్కాడు.

**

నాలుగు గుంటల ఖాళీ స్థలానికి చుట్టూరా కాంపౌండ్ తిప్పగా ఓ మూలన రేకుల షెడ్ ఉన్నది. అందులో నుండి అందరికి సారా సరఫరా జరుగుతూ ఉంటుంది. దాన్నిండా తాగే జనం.

"కొందరు హత్య అనుకుంటుండ్రన్న."

"అనుకోనీయ్." - తన చిన్న గడ్డాన్ని చేత్తో దువ్వుకుంటూ.

"నాకు భయమైతుందన్నా." - బిత్తర బిత్తరగ చూస్తూ.

"అట్లనా, ఇంకింత తాగు." అంటూ తన గ్లాసును ఖాళి చేసి కింద పెట్టాడు.

"ఆ ముసలోడు మామూలు మనిషి కాడన్నా."

"కాకపోని, ముసలోడే కదా. నీవు సంపకున్న ఇంకిన్ని రోజులకు ఆడైనా సచ్చేటోడే గదా! గాదాని

కెందుకింత పరేషాన్." తన ఎడమ చేత్తో అతని తలను నిమురుతూ అన్నాడు.

"పోలీసోల్లు గూడ అతనే సెర్ల దూకిండని రాసేసింద్రు. కేసు ఖతం చేసింద్రనుకో."

"మరి గంతే" అంటూ సీకుకు గుచ్చి కాల్చిన మాంసపు ముక్కను లాగి నోట్లో వేసుకొని నములుతూ, మిగిలిన ముక్కలవైపు చూస్తూ -

"నీకు సెరిత్ర తెలుసా?"

"ఏదో కొంచెం."

"అంత పెద్ద గాంధీ మహాత్మున్ని గింత ముండ కొడుకు గింతటోడు, ఆడు అంతకు ముందు ఎవ్వనికి తెల్వదు. అంత మందిల అందరు సూస్తుండగ పిస్తోలుతో కాల్చి సంపేయలే? ఏ దునియా హై మియా. అన్నీ నడుస్తనే ఉంటయి. నువ్వేం ఫికర్ సేయకు. అరేయ్ పిల్లగా, ఇంకా రెండు చప్టీలు పట్టుకరా."

"అచ్చా దాదా."

కొంతసేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. చుట్టూరా రకరకాల శబ్దాలు.

"అరె తిసుర బై, ఇంకో బేజా తిను." అంటూ

ఎదురుగా ఉన్న ఆకుడొల్ల వైపు చూపులతో చూపించాడు.

"కడుపుల భయం, భయం అయితుందన్నా."

"అరె నువ్ సెప్పితే ఇనవ్, ఎక్కువ సోంచాయించక్. భయం పడితేనే భయం - " అన్నాడు సైదులు దాదా.

"కళ్ళు తిరుగుతాన్నయన్నా." అంటూ ఎడమ చేత్తో కళ్ళు మూసుకొని, తలను మోకాళ్ళ మధ్య ఆనించు కున్నాడు. మూసుకున్న కళ్ళలో -

"అరె, నాకాలర్ పడతావురా వెధవా? నేనెవరనుకుంటున్నావు?"

"ఎవరైతే నాకేం బే, ఏం పీకుతవ్ ?" అంటూ గొంతును -

"వొదులు, వొదులు... ఇప్పుడే ఐ.జి.పికి ఫోన్ చేసి నీపని..."

"హ్హా.... హ్హా... సెయ్యి... సెయ్యి. "

"నిన్ను ....నిన్ను ....నీ....నీ...."

శబ్దం బంద్ అయ్యింది. కళ్ళు అట్లాగే తెరుచుకొని ఉండిపోయాయి. ఆ తర్వాత శ్వాస ఆగిపోయింది.

జేబులోని రూపాయలు, చేతి గడియారం, వేలి

ఉంగరం తీసుకున్నాక, ముందు శవం, తరువాత చెప్పులు, కళ్ళ అద్దాలు చెరువులోకి చేరాయి. ఆటో నంబర్ రాసిన నోట్‌బుక్‌కు అగ్గి అంటుకుంది. అంతా అయినాక ఓసారి చుట్టూ చూశాడు. ఎవరి పని మీద వాళ్ళు. వాహనాల పరుగు మామూలే. ఎవరూ చూడలేదని నిర్ధారణ చేసుకొని ఆటోను హైద్రాబాద్ వైపు నడుపుతూ ఉంటే, అక్కడ విగ్రహాలన్నీ తాను చేసిన పనిని చూపినవ్వుతున్నట్టు అనిపించి, ఒళ్ళంతా చెమట పట్టింది.

ఎవరో "ఆగు" అన్నట్టు వినిపించింది ఎదురుగ చూపుడు వేలు! అంతే, గొంతులో తడారి పోయింది. కళ్ళు బైర్లు కమ్మాయి. తమాయించుకొని చూశాడు. అది అంబేద్కర్ విగ్రహపు చూపుడు వేలు! ఆటోను స్లో చేసుకొని, కళ్ళను ఓసారి మూసి తెరచి, ఎడమ చేత్తో కాసేపు ఎదను అదిమి పట్టుకొని, ఓ బరువైన శ్వాసను వదిలాడు. ఎదురుగా ఆటోమేటిక్ ట్రాఫిక్‌లైట్ ఎర్రగా మారింది.

రాత్రి పదకొండు దాటింది. ఖాళీ ఆటో సచివాలయం ముందు నుండి టాంక్ బండ్ వైపు వెళుతూ, తెలుగుతల్లి బొమ్మ ముందుకొచ్చేసరికి అక్కడి చిక్కని

వెలుతురుకు కళ్ళు మూతలు పడ్డట్టు అనిపించగా, కాస్త స్లో చేసుకొని పక్కకు ఆపుకున్నాడు. జనం రాక పోక అంతగా లేదు. దేన్ని మరచి పోవడానికి తాగాడో, మైకం ఎక్కువౌతూ అదే మరి మరి గుర్తుకురాసాగింది. కళ్ళు నలుపుకున్నాడు. పళ్ళు కొరుక్కున్నాడు. ఆటో దిగి చుట్టూ చూసి సచివాలయం వైపు మళ్ళి.

"అందులో పైసలున్నేని పనే అయితది, లేనేని పని కానే కాదు. రాను రాను రాష్ట్రాన్నే అర్రాజ్ సేస్తరు" అంటూ గొణిగాడు.

తలపైకెత్తి నౌబోతు పహాడ్ మీదున్న బిర్ల మందిర్ వైపు చూసి,పడి పడి నవ్వి "మనుషులు ఫుట్ పాత్ మీద నిద్ర, బొమ్మలు గుళ్లల్లో పవళింపు వారెవా బిర్లా మనుషుల దగ్గర లాగి దేవుళ్లకు అర్పితం. భలె భక్తులు!" కళ్ళు మూస్తూ తెరుస్తూ నవ్వాడు.

ఎల్.ఐ.సి భవనం వైపు మళ్ళి, "ఈల్లు అసలు బేరగాళ్ళు, బతికున్నన్ని రోజులు వసూలు చేసి సచ్చినంక డబ్బులిస్తరట. ఎవరికి?" అంటూ ఈసడింపుగా చూశాడు.

మరొకసారి చుట్టూ చూసి మింటువైపు మళ్ళి,

"ఇక్కడ తయారయ్యే డబ్బంతా ఎటు పోతున్నట్టు? ఎవరు పంచుకున్నట్టు? సెప్పు - సెప్పు " అంటూ తెలుగుతల్లి బొమ్మ వైపు నడుస్తూ నిలదీస్తున్నట్టు అడిగాడు.

బొమ్మ వెనకనుండి సైరన్ చప్పుడు చేస్తూ పోలీస్ వ్యాన్ వస్తోంది. అది తన వైపే వస్తూ ఉండడం తన కోసమే వస్తున్నట్టు అనిపించింది. కళ్ళల్లో భయం. కాళ్లల్లో వణకుతో ఆటోను స్టార్ట్ చేసుకొని వేగంగా ఓవర్‌బ్రిడ్జి వైపు పోనిచ్చాడు. గుండె వేగం పెరిగిన కొద్దీ భయం పెరగసాగింది. భయం పెరిగినకొద్దీ ఆటో స్పీడ్ పెరిగింది. వెనుకనుండి ఎవరో తరుముకొస్తున్నట్టు వెనక్కు మళ్ళిమళ్ళి చూస్తూ, తాను ఎంతస్పీడ్‌గా వెళ్ళేదీ, ఎటు వెళ్ళేదీ గమనించే స్థితి దాటి..బుద్ధ విగ్రహం నీటిలోకి దించిన పల్లం వైపు ఆటో రోడ్డు దాటి పరిగెత్తి, "చర్ర్" న నీటిలో పడి "డుబ్ డుబ్" అంటూ మునిగిపోయింది.

1993 ●